

ఇక్కడ ఆధిక్యం ఎవరికో తెలుసా?

- అంతుచిక్కని కుత్బుల్లాపూర్ ఓటరు నాడీ
- అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు కలిపి 2లక్షలకు పైగా ఓట్లు
- లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి కూన శ్రీశైలంగౌడ్
- కూన ఓట్ బ్యాంక్ కాంగ్రెస్‌కు ఓట్ ట్రాన్స్‌ఫర్ అవుతుందా?
- ఇక్కడ ఏ పార్టీకి ఆధిక్యత వస్తుందనే దానిపై ఎన్నో సందేహాలు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ మెజార్టీ సాధిస్తుందోననే విషయంపై రాజకీయ పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఎవరికి వారే.. తమ పార్టీ అంటే తమ పార్టీ అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ జూన్ 4న వెలువడే ఫలితాల రోజు అసలు లెక్కలు బహిర్గతం అవుతాయి. గత అసెంబ్లీ ఎన్నికల నాటి ఫలితాలే పునరావృత్తం అవుతాయా? లేక మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఫలితాలు కూడా మారుతాయా.? అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించి ఆ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్ సుమారు 85 వేల మెజార్టీ సాధించారు. నాటి పరిస్థితి ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఉందా? అనేది సందేహమే.

ఏ పార్టీ మెజార్టీ సాధిస్తుందో?

కుత్బుల్లాపూర్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు సాధించింది. ప్రస్తుతం పోలైన మొత్తం 3,63,874 ఓట్లల్లో ఏ పార్టీ ఎక్కువ ఓట్లు పడతాయనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్,బీజేపీలో చేరారు. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు తీవ్రంగా పోటీ పడ్డాయి. కాని ఓటర్లు ఎవరిని ఆదరిస్తారనేది మాత్రం అంతుచిక్కడం లేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పూర్తిగా తారుమారయ్యే అవకాశాలు ఉన్నట్లు పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు సైతం అదే తరహాలో ఓటు వేశారని ఆయా పార్టీల నాయకులే అంగీకరిస్తున్నారు.

కూన రాక.. ఓట్ షేరింగ్ జరుగునా...?

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి కూన శ్రీశైలంగౌడ్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కాని లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం పుంజుకుంది. కాని అసెంబ్లీ నాటి ఫలితం వచ్చి ఎంపీ ఎన్నికల్లో ఓటు షేరింగ్ జరుగుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

◆ బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్‌కు 1,02,423 ఓట్లు, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కొలను హన్మంత్‌రెడ్డి 1,01,554 ఓట్లు సాధించారు. అయితే వీరు ఇరువురు ఇప్పుడు ఒకే పార్టీలో ఉన్నారు. అంటే వీరి ఇద్దరి ఓట్ షేర్ 2,03,977 కాంగ్రెస్ పార్టీకి ట్రాన్స్‌ఫర్ అవుతుందా? అనేది ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాలి.

◆ ఒక వేళ ఇదే జరిగితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి అధిక్యత లభించే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ కేడర్ మాత్రం కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ అధిక్యత ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు. ఏది ఏమైనా జూన్4న వెలువడే ఫలితాల వరకు వేచి చూడల్సిందే.

అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లు

కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని 4,01,665 మంది తమ ఓటు హక్కును అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించుకున్నారు. అందులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కేపీ వివేకానంద 1,87,999 ఓట్లు సాధించారు. ఇది రాష్ట్రంలోనే భారీ మెజార్టీ సాధించిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. ఇక బీజేపీ నుంచి పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్ 1,02,423 ఓట్లు సాధించారు. ఇక కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కొలను హన్మంత్‌రెడ్డి 1,01,554 ఓట్లు సాధించారు. ఇతరులు 9,689 ఓట్లు సాధించారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లు..

మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 7,24,992 ఓట్లు ఉండగా అందులో 3,63,874 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే 50.19శాతం పోలింగ్ నమోదైంది. అందులో పురుషులు 1,91,436 మంది, స్త్రీలు 1,72,390 మంది, ఇతరులు 48 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే ఎంపీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 3,63,874 ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



కొంపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: రాజీవ్‌గాంధీ చేసిన సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... దేశంలో ఆర్థిక సంస్కరణలతో పాటు ఐటీ రంగానికి బాటలు వేసి దేశ పురోగాభివృద్ధికి రాజీవ్ ఎనలేని కృషి చేశారన్నారు. నేడు హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందంటే దానికి రాజీవ్ గాంధీ కారణమని అన్నారు. ఈ దేశ ప్రజలు ఆయన సేవలను మరువరన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి నివాళుల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

– జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లోని ఇందిరగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ జాయింట్ కో.ఆర్డినేటర్ భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.



జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

ఆర్థికసాయం

జీడిమెట్ల: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ సహజ ధర్మం అని విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు సత్తిబాబు అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రాంతానికి చెందిన అశుతోష్ పటేల్ అనే వ్యక్తి బహదూర్‌పల్లిలో ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అశుతోష్ కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారు. సొంతూరికి వెళ్లేందుకు అతడి వద్ద డబ్బులు లేవు. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి ఫౌండేషన్ సీమ్స్ బోరో నిర్మాణ కంపెనీ ద్వారా మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందేలా చూశారు.

ప్రచారంలో ముందు.. ఆచరణలో వెనక్కు!

- వృథాగా పోతున్న తాగునీరు
- పట్టించుకోని జలమండలి అధికారులు

చింతల్: ఒక్కొక్క నీటిబొట్టును ఒడిసి పట్టి భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో జలమండలి విస్తృతంగా ప్రచారం చేస్తోంది. కానీ ఆచరణలో మాత్రం అది ఎక్కడా నోచుకోవడం లేదు. షాపూర్‌నగర్ రిజర్వాయర్ ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ సెంటర్ వద్ద ఒక వాల్వ్‌కు లీకేజీ ఏర్పడింది. ఇది ఫిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేసిన నాటి నుంచి నీరు లీక్ అవుతూ షాపూర్‌నగర్ సిగ్నల్ వరకు పారుతోంది. సంబంధిత అధికారులు దానికి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి ఫిల్లింగ్ సెంటర్ వద్ద మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీని అరికట్టాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



షాపూర్‌నగర్ రిజర్వాయర్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద వాల్వ్ నుంచి లీకవుతున్న తాగునీరు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్/నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని కొంపల్లి ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ విఘ్నేశ్వర ఫీడర్ పరిధిలోని రుద్రా కన్‌స్ట్రక్షన్స్, మోడీ బిల్డర్స్, మల్లారెడ్డి ఇంటి, జాయ్ కిడ్స్ స్కూల్ ప్రాంతల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్‌లోని రోడ్ నం. 1 నుంచి 8 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు..

◆ కేటీఆర్ కాలనీ ఫీడర్ పరిధిలోని కేటీఆర్ కాలనీ, బాలాజీహిల్స్ కాలనీ, జేఎన్ఎన్ యూఆర్ఎం ఫేజ్-2, తిరుమల నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుండి 3 గంటల వరకు...

◆ భవ్యాస్ ఫీడర్ పరిధిలోని భవ్యాస్ ఆనందం, బాలాజీ ఎలక్ట్రానిక్స్, ఈశ్వర్ విల్లాస్, రాక్‌చర్చి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

◆ రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ గుల్‌మొహర్, మా విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 11నుంచి 12.30గంటల వరకు..

◆ వాల్వో ఫీడర్ పరిధిలోని కౌసల్యకాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు...

◆ మల్లంపేట్ ఫీడర్ పరిధిలోని డైమండ్‌కాలనీ, రెయిన్‌బోకాలనీ, కేఆర్‌సీఆర్ కాలనీ, ప్రణీత్ ప్రణవ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

నిజాంపేట్: ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గృహకల్ప ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు...

◆ డాక్టర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని వాసవీ లేఅవుట్, న్యూవిజేత సూపర్ మార్కెట్, రాజీవ్‌గృహకల్ప రోడ్డు, శిల్పా లేఅవుట్, కెనరా బ్యాంక్, డాలర్ హోమ్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

మండల విద్యాధికారి వసంతకుమారి



సుచిత్రలోని ఓ ప్రైవేట్ పాఠశాల సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కుత్బుల్లాపూర్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి వసంత కుమారి అన్నారు. కుత్బుల్లాపూర్ మండలం సుచిత్రలో నూతనంగా శ్రీచైతన్య స్కూల్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పలువురి నుంచి విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు అందాయి. దీనిపై స్పందించిన అధికారులు పాఠశాలను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండానే విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు విచారణలో తేలింది. దీంతో వెంటనే ఎంఈవో వసంతకుమారి, మండల రిసోర్స్ పర్సన్ రమేశ్ మంగళవారం పాఠశాలకు చేరుకుని సీజ్ చేశారు. అనుమతులు తీసుకోకుండా మరోసారి పాఠశాలను కొనసాగిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇదే పాఠశాలలో సుమారు 160 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నట్లు సమాచారం. కాగా ఇప్పటి వరకు వారు చెల్లించిన ఫీజును యాజమాన్యం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

నిరుపయోగంగా బోర్లు, స్టాటిక్ ట్యాంక్‌లు

రంగారెడ్డినగర్: ఇరు శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బోర్లు, స్టాటిక్ ట్యాంక్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో స్థానికంగా నీటి అవసరాలను తీర్చేందుకు స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బోరు వేసి స్టాటిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పాటు నిరాటకంగా కొనసాగిన నీటి సరఫరా ఆపై నిర్వహణ లేకపోవడంతో నిలిచిపోయింది. అంతే కాకుండా స్టాటిక్ ట్యాంక్ నుంచి బోరు మోటార్‌కు వేసిన పైపులైన్ సైతం మాయమైంది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

◆ ఈ విషయాన్ని అటు జీహెచ్ఎంసీ.. ఇటు జలమండలి అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. తమ పరిధిలోకి రాదంటూ ఎవరికి వారు చెప్పడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని బోరు రిపేరు చేయించడంతో పాటు స్టాటిక్ ట్యాంక్‌కు పైపులైన్ కలిపి నీటి సరఫరాను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.



రోడ్లపైనే మెడికల్ వేస్టేజ్ పారబోత

సంబంధిత అధికారులు పట్టించుకోరా?



చింతల్ హెచ్ఎంటీ కాలనీలో ఓ రోడ్డులో మెడికల్ వేస్టేజ్..

చింతల్: ఆస్పత్రులపై అధికారుల నిఘా లేకపోవడంతో పలు ఆస్పత్రి యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పలు ఆస్పత్రిల్లో డయాగ్నస్టిక్ సెంటర్ల వద్ద నిర్వహించే రక్త పరీక్షల నమూనాలను సీసాలను నిర్వాహకులు ఇష్టానుసారంగా రోడ్లపైనే గుట్టలుగా పారబోస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు ఆయా యాజమాన్యాలు సేకరించి బయో వేస్టేజ్‌కు తరలించాల్సి ఉంటుంది. కానీ యాజమాన్యాలు రోడ్లపైనే పారబోస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా వ్యవహరిస్తున్నారు. చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని ప్రధాన రోడ్డులో డయాగ్నస్టిక్ సెంటర్ సిబ్బంది మెడికల్ వ్యర్థాలను తీసుకొచ్చి పారబోశారు. వీటి వల్ల అటుగా వెళ్లే చిన్నారులు వీటిని తీసుకొని ఆట వస్తువులుగా భావించి తమ చేతిలోకి తీసుకుంటున్నారు. మరోవైపు వీటి ద్వారా వచ్చే అనర్థాలు అనేకమంటూ అటుగా వెళ్లే పాదచారులు హెచ్చరికలు చేస్తున్నారు. బహిరంగా ప్రదేశాల్లో మెడికల్ వేస్టేజీని పారబోస్తున్న ఆస్పత్రి యాజమాన్యాలు, దయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో అక్రమ పార్కింగ్



సర్వీసు రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు

కుత్బుల్లాపూర్: పక్కనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్.. సర్వీస్ రోడ్డు వెంట అక్రమ పార్కింగ్. అటు ఇటు వెళ్లే వాహనాలు ఎదురుగా వస్తే ఇక అంతే.. గంటల తరబడి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడిన అటువైపు కన్నెత్తి చూడరు. కేవలం చలాన్లకే ప్రాధాన్యత ఇస్తూ అక్రమ పార్కింగ్‌ను గాలికి వదిలేస్తున్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ సర్వీస్ రోడ్డులో సోమవారం మధ్యాహ్న సమయంలో ఇలా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు కనిపించాయి. ఇప్పటికై నా సంబంధిత అధికారులు సర్వీస్ రోడ్డులో అక్రమ పార్కింగ్‌లను కట్టడి చేసేందుకు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

భారతీయ విద్యార్థుల అవసరాలను తీర్చడమే లక్ష్యం



క్లైర్ నోగూరా

అబిడ్స్: ఫ్రాన్స్, జర్మనీలోని భారతీయ విద్యార్థుల సంఖ్య వారి ఆర్థిక, రవాణా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఫ్రెంచ్ పిన్ టెక్ స్టడీలీ ఏర్పాటు చేశామని ఆ సంస్థ సీఈఓ క్లైర్ నోగూరా పేర్కొన్నారు. మంగళవారం క్లైర్ నోగూరా మాట్లాడుతూ.. ఫ్రాన్స్‌లో తమ సంస్థ ప్రధాన కార్యాలయం ఉందని భారత్‌లోనూ విస్తరణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఫ్రాన్స్, జర్మనీలోని భారతీయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, ఆర్థిక అవసరాలకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటి అని అన్నారు.

ఇక్కడ భారీ వాహనం వస్తే.. ట్రాఫిక్ జామే.!



దేవేందర్‌నగర్ చౌరస్తాలో భారీ వాహనం రావడంతో నిలిచిన ట్రాఫిక్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ చౌరస్తాలో భారీ వాహనం వచ్చిందంటే ట్రాఫిక్ జామ్ కావాల్సిందే. బాచుపల్లి, గాజులరామారం ప్రధాన రోడ్లను కలిపే ఈ మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దేవేందర్ నగర్ చౌరస్తా ఇరుకుగా ఉండడం, ఆపై రోడ్డు పక్కన పలు షాపులు ముందుకు రావడంతో వాహన రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. ఒక భారీ వాహనం వచ్చిందంటే నిమిషాల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలో 'సాక్షి'పలుమార్లు వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు రోడ్డుపై వెలసిన డబ్బాలను తొలగించారు. సంబంధిత అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నీళ్లు నిల్చును.. మేమెలా వెళ్దుమూ.?



రాంరెడ్డినగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

జీడిమెట్ల: వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో రాంరెడ్డినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌కు ఆనుకుని పారిశ్రామిక ప్రాంతం ఉంది. ఆ రోడ్డు మీదుగా ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై నిలిచే రోడ్డు నాలాలోకి వెళ్లకపోవడంతో రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు పట్టించుకుని రోడ్డుపై నీరు నిలవకుండా నాలాలోకి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వానొస్తే.. ఆ కంపెనీలకు పండగే.!

నాలాల్లో వర్షపు నీరు ప్రవహిస్తే చాలు.. పరిశ్రమలో నిల్వ చేసిన విష రసాయనాలు వదులుతారు

- పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు
- రసాయనాల వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్థానికులు

కుత్బుల్లాపూర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ కంపెనీల పంట పండినట్లే.. చిన్నపాటి వర్షం పడినా.. భారీ వర్షం కురిసినా పరిశ్రమలో నిల్వ చేసిన విష రసాయనాలు నాలాల్లోకి వదిలి చేతులు దులుపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత కంపెనీ యాజమాన్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఏమైనా.. చర్యలు తీసుకున్నారా అంటే శూన్యం అనే చెప్పాలి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో జీడిమెట్ల పారిశ్రామికవాడ ఉండగా అయోధ్యనగర్ నుంచి వెంకటేశ్వరనగర్ వరకు.. ఫాక్స్‌సాగర్, సుభాష్‌నగర్ గంపల బస్తీ నుంచి వెంకన్నహిల్స్, మోడీ బిల్డర్ వరకు నాలా విస్తరించి ఉంది. చిన్నపాటి వర్షం పడ్డ ప్రతిసారి రసాయనాలతో నిండి నాలా ప్రవహించడం పరిపాటిగా మారింది. వర్షపు నీరు రసాయనాలు విడుదల చేసే క్రమంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

తీవ్ర ప్రభావం ఉండే కాలనీలు ఇవే..

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని అయోధ్యనగర్ నుంచి బీరప్పనగర్, కుత్బుల్లాపూర్ , వెంకటేశ్వరనగర్, కాకతీయనగర్, వాణినగర్, గాయత్రినగర్, గణేష్‌నగర్, పాపయ్యయాదవ్‌నగర్, కల్పన సొసైటీ, మాణిక్యనగర్, ద్వారకానగర్ ప్రాంతాల మీదుగా నాలా విస్తరించి ఉండగా వర్షం పడ్డ ప్రతిసారి పైన పేర్కొన్న కాలనీల ప్రజలు ముక్కు పూటలు అదిరే వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

◆ అంతేకాకుండా శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. విష రసాయనాలు నాలాల్లో వదలడం మూలంగా తుమ్ములు, దగ్గు, గుండె వేగంగా కొట్టుకుంటుందని వాపోతున్నారు. రసాయనాలు వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని గతంలో పలు పర్యాయాలు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాల్సి ఉండగా...

◆ జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు ప్రాంతాల్లో ఉన్న రసాయన పరిశ్రమలు ఉత్పత్తులు చేసే క్రమంలో వెలువడే రసాయనాలను వెంటనే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ వాటిని నిల్వ చేసి చిన్నపాటి వర్షం పడ్డా.. భారీ వర్షం కురిసినా వెంటనే నాలాల్లోకి వదిలి చేతులు దులుపుకోవడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది డంపింగ్ నిర్వాహకులతో చేతులు కలిపి వాటిని అర్ధరాత్రి వేళ నాలాల్లో వదిలేస్తూ వస్తున్నట్లు వినికిడి.



నాలాలో ప్రవహిస్తున్న పరిశ్రమల వ్యర్థ రసాయనాలు (ఫైల్)

◆ అట్టి రసాయన పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత పొల్యూషన్ బోర్డు అధికారులు చేతులెత్తేశారని చెప్పవచ్చు. వర్షాకాల సమయంలో ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షం కురిసే సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే తప్పకుండా రసాయనాలు వదిలే పరిశ్రమలు గుర్తించే అవకాశం ఉంటుంది అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రెండు ఘటనలు ఒకే నాలా ప్రాంతంలో..

◆ వెంకటేశ్వర నగర్ మీదుగా వెళ్లే నాలా లో రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు నాలాలో పడి కొట్టుకపోగా రెండు రోజుల తర్వాత శవమై తేలాడు. ఇది మరువకముందే గత ఏడాది ఓ మద్యం షాపు వద్ద కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి ఇదే నాలాలో కొట్టుకుపోయి 15 రోజుల తర్వాత ఐడీపీఎల్ ప్రాంతం నాలాలో గుర్తించారు. ఇలా ఈ రెండు ఘటనలు ఒకే ప్రాంతంలో చోటు చేసుకోవడం గమనార్హం.